12న స్కౌట్స్ అండ్ గైడ్స్ సమావేశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యుల సమావేశం ఈ నెల 12న ఆర్ట్స్ కళాశాల రోడ్‌లో ఉన్న కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఏర్పాటు కానున్నట్టు పేర్కొన్నారు. అందువల్ల స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్ మాస్టర్స్, కెప్టెన్లు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఫోన్ నంబరు 9703148269, దుర్గా నాగేశ్వరరావు ఫోన్ నంబరు 7207564762కు సంప్రదించాలని సూచించారు.

జోరందుకోని ధాన్యం కొనుగోలు

- జిల్లాలో తొమ్మిది మండలాల్లోనే ప్రారంభం
- 58 చోట్లే తెరుచుకున్న కేంద్రాలు
- బ్యాంకు గ్యారంటీలు సమర్పించని మిల్లర్లు
- ఇప్పటివరకు 5,549 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు ఇంకా జోరందుకోలేదు. డిసెంబరు రెండో వారంలోకి ప్రవేశించినా జిల్లాలో సగం మండలాల్లోనూ ప్రారంభం కాలేదు. తుపాను నేపథ్యంలో సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని ఆర్‌బికెల ద్వారా తీసుకుంటామని అధికారులు చెప్పినా... అవి ఒకట్రెండు ప్రాంతాలకే పరిమితమైంది. మరోవైపు వర్షాలు పడటంతో తడిచిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకుంటున్నారు. తేమశాతం పరిగణనలోకి తీసుకోమని చెప్పినా ఆరబెట్టిన ధాన్యం తీసుకురావాలని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది చెప్తున్నారు. మరోవైపు అధికార యంత్రాంగమూ పూర్తిస్థాయిలో సన్నద్ధం కాలేదని తెలుస్తోంది. సిబ్బంది నియామకం, గోనె సంచులు, జిపిఎస్ పరికరాలను సమకూర్చుకోవడంలో కొంత సమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది.

కవిటిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్‌లో 3,51,843 ఎకరాల్లో వరి వేశారు. ఇందులో 3,50,765 ఎకరాలకు పంటల క్రాపింగ్ జరిగింది. 3,34,330 ఎకరాలకు ఇకెవైసి పూర్తయింది. ఈ సంవత్సరం 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 7,87,447 మెట్రిక్ టన్నులు మార్కెట్‌లోకి వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం వరికి సాధారణ రకానికి రూ.2,183, గ్రేడ్-ఎ రకానికి రూ.2,203 మద్దతు ధర ప్రకటించింది. ధాన్యం కొనుగోలుకు అధికారులు జిల్లావ్యాప్తంగా 390 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను మూడు కేటగిరీలుగా విభజించారు. 2 వేలు పైబడి ధాన్యం సేకరించే అవకాశం ఉన్న కేంద్రాలను-ఎ కేటగిరిగా, 1000 నుంచి 2 వేలు టన్నుల లోపు వరకు కొనుగోలు చేసేవాటిని బి కేటగిరిగా విభజించారు. అదేవిధంగా వెయ్యి టన్నుల కంటే తక్కువ ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉన్నవాటిని సి కేటగిరిగా నిర్ణయించారు. జిల్లాలో ఎ కేటగిరిలో 182, బి కేటగిరిలో 176, సి కేటగిరిలో 32 కేంద్రాలు ఉన్నాయి.

నత్తనడకన కొనుగోళ్లు

ధాన్యం కొనుగోలుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని అధికారులు చెప్తున్నా... క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు పది మండలాల్లో మాత్రమే కొనుగోలు చేశారు. 58 కేంద్రాలే తెరుకున్నాయి. ఇప్పటివరకు 5,549.36 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇందులో గ్రేడ్-ఎ రకం 5.2 మెట్రిక్ టన్నులు కాగా, సాధారణ రకం ధాన్యం 5,544 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశారు. కేంద్రాల్లో ధాన్యం నాణ్యతా ప్రమాణాల పరిశీలన, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు వంటి అవసరాల కోసం టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికపై 1170 మందిని నియమించారు. వీరికి మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు.

బ్యాంకు గ్యారంటీల సమర్పించని మిల్లర్లు

కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేశారు. మిల్లులకు తరలించిన తర్వాత వాటిని మర ఆడించేందుకు 255 మిల్లులను ఎంపిక చేశారు. మర ఆడించేందుకు ఇస్తున్న ధాన్యం విలువకు సమానమైన బ్యాంకు గ్యారంటీలను మిల్లర్ల నుంచి పూర్తి స్థాయిలో బ్యాంకు గ్యారంటీలు సమర్పించలేదని తెలుస్తోంది. దీంతో ధాన్యం కొనుగోలు మందకొడిగా సాగుతున్నాయి. ధాన్యం సేకరణలో ఈ సంవతసరం కొత్త జిపిఎస్ పరికరాలను వినియోగిస్తున్నారు. కళ్లాల నుంచి మిల్లులకు ధాన్యం తీసుకువెళ్లే వాహనాలకు జిపిఎస్ పరికరాలను అమర్చుతున్నారు. ధాన్యం కొనుగోలులో పారదర్శకత కోసం వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. జిల్లాలో 5 వేలు పరికరాలు అవసరమవుతాయని గుర్తించారు. ఇప్పటివరకు 600 వరకు మాత్రమే అందుబాటులో ఉంచారు.

పోర్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్

మూలపేట పోర్టుతో ఉపాధి

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- నౌపడ

మండలంలోని మూలపేట రోర్టు సౌత్ బ్రేకింగ్ వాటర్ పనులు 1.5 కిలోమీటర్లు, నార్త్ బ్రేకింగ్ వాటర్ పనులు 560 మీటర్లు పనులు జరిగాయని, అలాగే బెర్త్, ఇతర పనులు శరవేగంగా చేపడుతున్నారని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఇదంతా శంకుస్థాపన చేసిన ఆరు నెలల లోపే జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మండలంలోని మూలపేట పోర్టు నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు మైక్‌ల ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు కాకుండా తాము చేసిన అభివృద్ధిని చూడాలని హితవుపలికారు. తమకు అలవాటైన సెల్ఫీలు తీసుకొని మీరు చెప్పాలనుకునే అబద్ధాలు చెప్పుకోవాలని ఎద్దేవా చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా వేచి చూసిన మూలపేట పోర్టు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందన్నారు. జిల్లా ప్రజల చిరకాల స్వప్నం త్వరలో నెరవేరనుందని అన్నారు. వలసలపై ఆధారపడిన జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామని అన్నారు. వచ్చే ఏడాది జనవరిలో పోర్టు డర్జింగ్ పనులు మొదలు పెట్టి, మూడు నెలల్లో ట్రైల్ రన్ చేపడతామని తెలిపారు. పోర్టు నిర్మాణం వల్ల అనుబంధ పరిశ్రమలు నెలకొల్పి, వేలాది మందికి ఉపాధి, చుట్టుపక్క ప్రాంతాలకు విలువ పెరుగుతుందని అన్నారు. జిల్లా అభివృద్ధిలో జగన్ పాత్ర చాలా స్పష్టమైనదని, దీనిని అందరూ గమనించాలని కోరారు. విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు, చెన్నయ్, ముంబై, కొచ్చిన్ ఏ తీర ప్రాంత నగరమైన అభివృద్ధి చెందిందంటే పోర్టు దాని అనుబంధ పరిశ్రమలు, అభివృద్ధి ఫలాలు వల్లేనని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో జిల్లాలో నిరుద్యోగులు అందరికీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో పనిచేస్తామని అన్నారు. యువకులు, సామాన్య ప్రజలు, పోర్టుకు వచ్చి అభివృద్ధి చూడాలని కోరారు. అలాగే స్కూల్ యాజమాన్యం విద్యార్థులను విహారయాత్రకు ఇక్కడికి తెచ్చి చూపించి పోర్టు నిర్మాణం, అభివృద్ధిపై అవగాహన కల్పించాలని కోరారు.

14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు తీర ప్రాంత అభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే విశాఖపట్నం పరిపాల రాజధాని మన అందరికీ గర్వకారణమని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టు ఇలా ఉత్తరాంధ్రను పూర్తి అభివృద్ధి పథంలో నడిపించాలని బలమైన రాజకీయ నిర్ణయం జరిగి ఇతర జిల్లాలతో పోటీపడుతుందని అన్నారు. ఈ నెల 15న పలాసలో జరుగు ముఖ్యమంత్రి జగన్ సభకు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, టెక్కలి సబ్ కలెక్టర్ సూరజ్ కమల్, జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, స్థానిక సర్పంచ్ జె.బాబూరావు, విశ్వసముద్ర జిఎం శంకర్ పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న స్పీకర్ సీతారాం

జగనన్న లే అవుట్ల నిర్వహణ ఇలాగేనా?

సంబంధిత శాఖల అధికారులపై స్పీకర్ ఆగ్రహం

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న లే అవుట్లలో పలుచోట్ల కనీస మౌలిక వసతులు, సదుపాయాలను కల్పించకపోవడంపై సంబంధిత అధికారులపై శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. పొందూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్షించారు. మండలంలో 16 జగనన్న లే అవుట్లకు గాను ఆరు లేఅవుట్లలో మాత్రమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా, మిగిలిన 10 లే అవుట్లలో ఒక్క నిర్మాణం ప్రారంభం కాకపోవడం విస్మయం వ్యక్తం చేస్తూ... ఇది అధికారుల ఆలసత్వానికి నిదర్శనమని అన్నారు. ఇళ్ల నిర్మాణాలు ఆయా లే అవుట్లలో చేపట్టకపోవడానికి సంబంధిత శాఖల అధికారులు కనీస మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోకపోవడమే కారణమని, ఇది ఎంతవరకూ సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెనుబర్తి, గోరింట గ్రామాల్లో జగనన్న లేఅవుట్లు నిర్మించే స్థలం ఆక్రమణకు గురవుతుందని స్పీకర్ దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. గృహనిర్మాణ శాఖ పీడీ గణపతి మాట్లాడుతూ మండలంలో 1780 ఇళ్లు మంజూరు చేశామని, ఇందులో 938 ఇళ్లు పూర్తి చేశామని, 499 బిబిఎల్ స్థాయిలోను, 189 బేస్‌మెంట్, 71 రూఫ్‌లెవెల్, 82 శ్లాబ్ స్థాయిల్లో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రంగయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, విద్యుత్‌శాఖ ఎస్ఇ నాగిరెడ్డి, కృష్ణమూర్తి, డిఇ భయ్యన్నాయుడు, తహశీల్దార్ వై.వి.ప్రసాద్, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

బిఎస్‌సి నర్సింగ్‌కు అడ్మిషన్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎంసెట్‌లో ఉత్తీర్ణులై నీట్ పరీక్ష రాసిన పేద విద్యార్థులకు బిఎస్‌సి నర్సింగ్ కోర్సులో అడ్మిషన్లు ఉచితంగా కల్పిస్తున్నామని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగేళ్ల కోర్సు పూర్తి చేసిన అనంతరం వారికి ఉద్యోగావకాశాలు కల్పించి ఈ కోర్సు ఫీజును ఆ జీతం నుంచి మినహాయిస్తామన్నారు. అలాగే డిగ్రీ పాసైన విద్యార్థులకు మూడు నెలల పాటు ఉచిత వసతి, భోజనంతో కూడిన శిక్షణ అందించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు శ్రీకాకుళం సమీపంలోని రాగోలులో జెమ్స్ ఆస్పత్రి క్యాంపస్‌లోని కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 7680945357, 9121999654, 7995013422 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రదర్శన నిర్వహిస్తున్న ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మనువాదుల పాలనలో హరిస్తున్న హక్కులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

దేశంలో పౌరులు మాట్లాడే హక్కు, జీవించే హక్కు, విద్యని అభ్యసించే హక్కు క్రమక్రమంగా మనువాదుల పాలనలో హరించబడుతున్నాయని ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, నగర కన్వీనర్ శ్రీదేవి పాణిగ్రహి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు చందు అన్నారు. ఈ నెల 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశభక్తి ముసుగులో ప్రజలు ఏం తినాలో? ఏం కట్టుకోవాలో? పాలకులు శాసించడం శోచనీయమని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా మహిళల హక్కులు హరించబడుతున్నాయని, మహిళల హక్కులే మానవ హక్కులుగా గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎన్నో అవమానాలకు ఓర్చి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో రూపొందించిన బాధ్యతలతో పాటు, అన్ని హక్కులు పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, బోటనీ లెక్చరర్ నాయుడు, రచయిత్రి టి.ఎర్రమ్మ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సంతోష్ కుమార్, పవిత్ర సునీత పాల్గొన్నారు.

పర్యటిస్తున్న అచ్చెన్నాయుడు

కరువు మండలంగా ప్రకటించాలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

నందిగాం: నందిగాం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని కొండ ప్రాంతాలైన నౌగాం, మదనాపురం, హర్షబాడ, దిమ్మిడిజోల, కిల్లాడ తదితర గ్రామాల్లో వరి పంట నష్టపోయిన ప్రాంతాల్లో శనివారం పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అనావృష్టి మూలంగా నష్టపోయిన రైతులకు ఇన్స్యూరెన్స్ ఇన్‌ఫుట్ సబ్సిడీ ఇచ్చి కరువు మండలంగా ప్రకటించాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కరువు మండలంగా ప్రకటించి ఇన్స్యూరెన్స్ ఇన్‌ఫుట్ సబ్సిడీ పరిహారం ఇవ్వకపోతే మరో వంద రోజుల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులను ఆదుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పి.అజయ్‌కుమార్, నాయకులు సలాన కృష్ణారావు, ఎం.బాలకృష్ణ, పి.చంద్రశేఖరరావు, బి.శేషగిరిరావు, ముదిలి సింహాచలం, ఎం.లోకనాథం, ఎస్.జానకిరామ్ పాల్గొన్నారు.

సిఎం పర్యటనా ఏర్పాట్లు పరిశీలన

సిబ్బందితో మాట్లాడుతున్న జెసి నవీన్

పలాస: పలాసలో రూ.50 కోట్లతో నిర్మించిన 200 పడకల ఆస్పత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రాలను ఈ నెల 15న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో జెసి ఎం.నవీన్ పలు ప్రాంతాల్లో పర్యటించిన ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ వేదిక ప్రాంతమైన పలాస రైల్వే క్రీడా మైదానం, అలాగే ఆస్పత్రి సమీపంలోని హెలీప్యాడ్, కిడ్నీ ఆస్పత్రి పరిసరాలను, వాహనాల పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. సిఎం పర్యటనకు హాజరయ్యే ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, తహశీల్దార్ ఎల్.మధుసూదన రావుకు ఆదేశించారు. రోడ్ షో రహదారిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పలాసలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లకు కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్మార్ట్ స్కూల్ క్రీడా మైదానం, రైల్వే ఇనిస్టిట్యూట్ ప్రాంతాలను పరిశీలించారు. ఈయన వెంట ఆర్‌డిఒ భరత్ నాయక్, మున్సిపల్ ఎఇ అవినాష్, రెవెన్యూ అధికారులు పైల వెంకటేశ్వరరావు, ఖగేశ్వరనాయుడు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.డి బాలాజీ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ట్రిపుల్ ఐటిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని డైరెక్టర్ ఆచార్య కొక్కిరాల వెంకట ధన బాలాజీ అన్నారు. ఎచ్చెర్లలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ట్రిపుల్ ఐటి క్వాలిటీ మానిటరింగ్ కమిటీ శనివారం సందర్శించింది. ఈ కమిటీలో సైంటిస్టు జె.శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్, ఫుడ్ కెమిస్ట్రీ డివిజన్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఐసిఎంఆర్) యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.భానుకిరణ్, శ్రీకాకుళం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామకృష్ణముని, చీఫ్ మెస్ కో-ఆర్డినేటర్లు వి.సోమిబాబు, ఆర్.మల్లీశ్వరి ఉన్నారు. ఆహారం తయారీకి వాడే అన్ని పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మెస్ కమిటీతో సమావేశం నిర్వహించి నాణ్యమైన ఆహారం అందించడంలో తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు. ట్రిపుల్ ఐటిలో తీసుకుంటున్న జాగ్రత్తలను డైరెక్టర్‌ను, ఒఎస్‌డి ఎల్.డి.సుధాకర్, బాబులు వివరించారు. వీరితో పాటు డీన్ అకాడమిక్స్ మోహన్ కృష్ణచౌదరి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ గేదెల రవి, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకట ధన బాలాజీ

ప్రజాప్రతినిధులకు తీరిక లేదా?

వీక్షణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. సీజన్ ప్రారంభం నుంచి వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యాయి. వర్షాలు కురవకపోవడంతో వేలాది ఎకరాల్లో పంటలు వేయలేకపోయారు. తగినంత వర్షాలు లేక వేసినా పంటలూ ఎండిపోయాయి. ఇంజిన్ల సాయంతో పంటలను తడిపి ఏదో రకంగా నెట్టుకొచ్చిన రైతులను మిచౌంగ్ తుపాను తీవ్ర రూపంలో మరికొంత నష్టాన్ని మిగిల్చింది. వరి కోతలు ఊపందుకుంటున్న సమయంలో వర్షాలు పడటంతో పంట నీట మునిగింది. కొన్నిచోట్ల కోతలు పూర్తవ్వడంతో పొలాల్లోనే వరి ఓవులు తడిసిముద్దయ్యాయి. కోతలు పూర్తి కాని వరి పంట సుమారు 2 వేల ఎకరాల్లో నీటి మునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. కోతలు పూర్తయిన పంటకు నష్టపరిహారం వచ్చే అవకాశం లేకపోవడంతో వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. కోతలు పూర్తయి తడిసిన పంటే ఎక్కువగా రైతులు కోల్పోయారు. తుపానుపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సమీక్ష తర్వాత కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశాలతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పంట నష్టం వివరాలను ప్రాథమికంగా గుర్తించారు. మరోవైపు జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితుల కారణంగా రైతులు నష్టపోయారు. జిల్లాలో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో 4,37,153 ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉండగా, 3,81,833 ఎకరాల్లోనే పంటలు వేశారు. వరి విషయానికొస్తే 3,98,750 ఎకరాల్లో వేయాల్సి ఉండగా, 3,53,325 ఎకరాల్లో రైతులు విత్తనాలు వేయగలిగారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో 20,813 ఎకరాల్లో వరి ఎండిపోయింది. రైతులు, కరువు పరిస్థితుల అంశం అధికార, ప్రతిపక్ష పార్టీలకు పట్టడం లేదు. ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులపై మరింత బాధ్యత ఉంది. రైతులకు కష్టం వస్తే మేమున్నామంటూ భరోసా నిచ్చే పనిచేయాలి. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆదుకుంటామంటూ రైతులకు ధైర్యం చెప్పాలి. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఆ పనిచేయడంలో విఫలమయ్యారు. జిల్లాలో ఇద్దరు మంత్రులున్నా ఏనాడూ కరువు పరిస్థితులపై సమీక్షించిన దాఖలావు లేవు. జిల్లాలోనే ఉన్నా వ్యవసాయ, నీటి పారుదల సలహా మండలి సమావేశాలకు సైతం హాజరు కాకుండా తమ ఉదాసీన వైఖరిని ప్రదర్శించిన సందర్భాలను గతంలో చూశాం. తుపాను ప్రభావంతో వర్షాలకు పంటలు నీటి మునిగినా ఏ ఒక్కరూ కనీసం పొలాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో నిరంతరం ప్రజల్లో ఉండేందుకు పాకులాడుతున్న నేతలు తుపాను నష్టపోయిన రైతులను పలకరించడానికి మాత్రం తీరికలేకపోయింది. గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్న సురక్ష వంటి ప్రభుత్వం, పార్టీ ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసి అధిష్టానం దృష్టిలో పడేందుకు పోటీ పడుతున్న నాయకులు... పంట పొలాల సందర్శనకు మాత్రం సమయం వెచ్చించడం లేదు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యమివ్వకుండా కేవలం ఎన్నికలే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లాలని ప్రయత్నిస్తే ఒక్కోసారి ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు సరిగ్గా ఇదే అనుభవం ఎదురైంది. సరుబుజ్జిలి మండలం వీరమల్లిపేటలో ఈ నెల 8న నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై స్థానికులు నిలదీశారు. పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును శనివారం మూలపేట పోర్టు నిర్వాసితులు నిలదీశారు. పోర్టుకు భూములు ఇచ్చే ముందు ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, వారి సమస్యలు పట్టించుకోకుండా వ్యవహరిస్తే ఇటువంటి పరిస్థితులే ఉత్పన్నమవుతాయి. మరోవైపు టిడిపి పార్టీ పరిస్థితి కూడా అందుకు భిన్నంగా ఏమీ లేదు. అధికార పార్టీ వైఫల్యాలను తనకనుకూలంగా మార్చుకుని జనంలోకి వెళ్లాల్సిన టిడిపి అదే పంథాలో వెళ్తోంది. తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు టిడిపి నాయకులకు తీరికలేకపోయింది. ప్రభుత్వంపై కేవలం రాజకీయ విమర్శలకే నాయకులు పరిమితమవుతున్నారు. కరువు, వర్షాలతో నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం దక్కేలా చూడాల్సిన బాధ్యత అధికార పార్టీ ప్రజాప్రతినిధులపై ఉంది. ప్రభుత్వంపై ఒత్తిడి తేచ్చేలా టిడిపి తన పని చేయాల్సి ఉంది.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE, SOMPETA.
O.S.5/2023

Between:
Sasumana Hemasundara Rao. --Plaintiff.
And:
Sasumana Yetheswara Rao And others. --Defendants.

NOTICE.

To,
D-1: Sasumana Yetheswara Rao, s/o Hemasundara Rao, Aged 23 years, M.Tech., Permanent resident of Pedda Veedhi, Garudhakandhi village & P.O., Palasa Mandal, Srikakulam Dist.

Please take notice that the plaintiff herein filed a suit for partition against you and it stands posted to **11-12-2023 at about 10:30 A.M.** in the above Court for your appearance, appear either in person or through your Advocate on that day, failing which the matter will be decided as per law.

R. SRINIVASA RAO
K. RAJANIKANTH
K.S.PRASADBABU
ADVOCATES,
PALASA-SOMPETA.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
ఆమదాలవలస
OS 12/2022

Between: **వెలమల తేజేశ్వర రావు మరియు ఇతరులు** ...వాది
And: **ముద్దాడ వెంకటరావు మరియు ఇతరులు** ...ప్రతివాదులు

నోటీసు

To
D-2. ముద్దాడ రేణు D/o వెంకటరావు D.no.2-31, లోద్దల కాగితపల్లి గ్రామం, సరుబుజ్జిలి మండలం, శ్రీకాకుళం జిల్లా.

వాది మీపై పైకోర్టు లో ఆస్తులు పంపకాలు కోసం దావా వేసి యున్నారు మీకు ఎన్నిసార్లు సమన్లు బేటా కట్టననూ తప్పించుకొని తిరుగుచున్నారు. అందువలన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు పైదావా తేది 13-12-2023 నకు వాయిదా వేసియున్నారు. అందువలన **తేది 13-12-2023 న ఉదయం గంటలు 10.30 ని॥ లకు** పై కోర్టు లో హాజరు కాగలరు. లేనిపక్షమున మీ పరోక్షమున పై దావా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

కంచరాన నాగభూషణరావు
గురుగుబెల్లి ప్రభాకర్ రావు
న్యాయవాదులు,
శ్రీకాకుళం, సెల్: 9440149767.

ఆలయ పనులను పరిశీలిస్తున్న స్పీకర్ సీతారాం

ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజలందరు ఇలవేల్పు దైవంగా కొలిచే పోలపోలమ్మ అమ్మవారి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం ఆలయ కమిటీసభ్యులు, మున్సిపల్ శాఖ అధికారులతో దేవాలయ అభివృద్ధిపై గుడి ఆవరణలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయానికి అన్ని దిశల్లో భక్తుల రాకపోకలు సాగేలా చూడాలని కమిటీసభ్యులకు సూచించారు. ప్రధాన రహదారి నుంచి దేవాలయం వరకు రోడ్డు కనెక్టివిటీ పెంచేలా మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను అమ్మవారి సింహద్వారం, దేవతామూర్తుల విగ్రహాలను జరుగుతున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, ఇఇ సుగుణకర్, ఎఇ అప్పలనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అచ్చెన్నాయుడుకు కలిసిన టిడిపి నాయకులు

టిడిపితోనే అభివృద్ధి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్రంలో ఎక్కడ చూసినా టిడిపి అభివృద్ధి, చేసిన సంక్షేమమే కనిపిస్తుందని, సిఎం జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధికి వెనుకబాటు చేసి, అవినీతికి ముందు బాటవేశారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. జగన్‌రెడ్డి పాదయాత్రలో మాయమాటలు చెప్పి ముఖ్యమంత్రి అవ్వాలని పంతంతో రాజకీయాలు చేసి మోసం చేసి విద్యార్థులకు, నిరుద్యోగులతో పాటు అందరికీ తీరని అన్యాయం చేశారని, ఈ విషయాన్ని గట్టిగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బోయిన రమేష్, కొర్ల గోవిందరావు, బోయిన సత్యనారాయణ, రాహుల్, బి.రంగ, నౌగాపు నాగరాజు, తంగుడు సునీల్, ధర్మాన నాగరాజు, శ్రీనివాస్, టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తర్లాపల్లి పంచాయతీ యువత వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి అచ్చెన్నాయుడు పార్టీలోకి ఆహ్వానించారు.

డాక్టర్ గ్రేస్‌ను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- సోంపేట

రోటరీ క్లబ్, ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక రోటరీ క్లబ్ భవనంలో నిర్వహించిన శిబిరానికి పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి సుమారు 800 మంది రోగులు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మరెన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి ద్వారా విశేష సేవలందిస్తున్న సూపరింటిండెంట్ డాక్టర్ గ్రేస్‌తో పాటు వైద్యులు రామారావు, సౌజన్య లక్ష్మణ్‌లను ఘనంగా సత్కరించారు. రోటరీ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్యవరం వైద్య సిబ్బందితో, సోంపేట రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న శ్రీనివాసరావు

ఘనంగా క్రియేటివ్ కన్‌స్ట్రక్షన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో జిటిరోడ్‌లో ఉన్న క్రియేటివ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ 30వ వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా లైసెన్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు. సంస్థ యజమాని ముని శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నగరంలోని పలువురు ఇంజినీర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ రంగంలో 30 ఏళ్ల అనుభవంతో సమాజంలో మంచి గుర్తింపు తీసుకురావడంలో సంస్థ తోడ్పడిందన్నారు. ప్రాథమిక అవసరాలలో ఒకటైన సొంతింటి కల నెరవేర్చేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. దీనికితోడు ఎంతో మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నట్టు చెప్పారు. అన్ని రకాల కమర్షియల్, రెసిడెన్షియల్, ఇండస్ట్రియల్, అపార్ట్‌మెంట్లు, ఆలయాల నిర్మాణం చేపట్టి మన్ననలను పొందుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిర్మాణాలు చేపట్టడానికి కృషి చేస్తామన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి- కొత్తూరు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి సవర సావిత్రి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. గత సమావేశంలో ఎరువులు అధిక ధరలకు అమ్ముతున్నారని సభ్యులు ఎఒ శ్రీనివాసరావును ప్రశించంగా ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో ఇటీవల దాడులు చేసారని గ్రామ హార్టికల్చర్ అధికారి దివాకర్ తెలిపారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మినట్టయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసేందుకు నేరడి, లబ్బ, మెట్టూరు రైతు భరోసా కేంద్రాలు గుర్తించామన్నారు. దీనిపై సర్పంచ్‌లు కె.శ్రీనివాసరావు, నాగళ్ల అప్పన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు సమాచారం లేదని, దళారుల రాజ్యమని సభలో లేవనెత్తారు. జలజీవన్‌పై గ్రామాల్లో మహిళా సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తున్నా కనీసం సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వడం లేదని ఎంపిఎం జనార్ధన్‌ను నీలదేశారు. వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు కలుగజేసుకొని ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని, రూల్ ప్రకారం నడుచుకోవాలన్నారు. 28 అంగన్వాడీ కేంద్రాలకు నాడు-నేడు పనులు మంజూరయ్యాయని సూపర్‌వైజర్ సుధావాణి సభకు తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ ఎం.పావని, ఇఒ కృష్ణారావు, ప్రత్యేక అహ్వానితుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ వేదిక

పలాస: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి చక్రవర్తి

ప్రజాశక్తి- పలాస

కేసులు రాజీ చేసుకునేందుకు లోక్ అధాలత్ చక్కనైన వేదిక వంటిందని జూనియర్ సివిల్ జడ్జి చక్రవర్తి మల్లా అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి చక్రవర్తి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న తగాదాలతో పంతాలకు పోయి కేసులు నమోదు చేసుకొని కోర్టులు చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృధా చేసుకోవడం సరికాదని, రాజీపడదగిన కేసులు పరిష్కరించేందుకే లోక్ అదాలత్‌లు నిర్వహించడం జరుగుతుందని, వీటిని కక్షిదారులు వి నియోగించుకోవాలన్నారు. శనివారం నిర్వహించిన అధాలత్‌లో 275 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.విశ్వేశ్వరరరావు, పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జిఎంఎస్ అనీల్ రాజ్, ట్రెజరర్ రవి కుమార్, న్యాయవాదులు బెండి కాళిదాస్, ప్రభాకర్, ఎస్.వెంకటరమణ రామకృష్ణ, లక్ష్మి, సూపరెంటిండెంట్ పాణిగ్రహ్, కోర్టు సిబ్బంది గోవింద్, సంజీవరావు పాల్గొన్నారు.

పొందూరు: లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వలన ఇరువర్గాలకు న్యాయం లభిస్తుందనిఅన్నారు. పొందూరు ఫైస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 353 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో సూపరెండెంట్ సత్యనారాయణ, లోక్‌అదాలత్ మెంబర్ కృష్ణారావు, న్యాయవాదులు బి.మంజుల, బ్రహ్మాజీ, కిరణ్‌కుమార్, అశోక్, రామ్మోహన్, సురేష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జరిగిన జాతీయ లోక్‌ఆదాలత్ ద్వారా 513 కేసులను పరిష్కరించామని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాసంఘం అధ్యక్షురాలు సి.హరిప్రియ తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు నరసింహామూర్తి, వి. అప్పలనాయుడు, ఎజిపి ఎస్.తిరుపతి, ఎపిపి డి.హరిప్రియ, న్యాయవాదులు పి.అర్జునరావు, పల్లి వాసుదేవరావు, పూజారి వాసుదేవరావు, సిహెచ్ వెంకటరావు, బి.జీవన్, కె.వెంకటేశ్వరరావు, బి.భీమారావు, ఎల్.శ్రీనివాస్, కోర్టు కానిస్టేబుల్ పాల్గొన్నారు.

పొందూరు : లోక్‌అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తి జ్యోత్స్న

కొత్తూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి ఎస్.మణి అదేశాలతో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 398 కేసులు రాజీ చేశారు. కార్యక్రమంలోఎపిపి రఘునాథ్ తదితరులున్నారు.

ఆమదాలవలస: స్థానిక కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 509 కేసులు పరిష్కారమయ్యాయి. న్యాయవాదులు పైడి వరాహ నరసింహులు, బి.సీతారాం, గురుగుబెల్లి ప్రభాకరరావు, వాడవలస రాజేశ్వరరావు, తమ్మినేని అన్నంనాయుడు, బొడ్డేపల్లి మోహనరావు, సిఐ పి.పైడయ్య, నాలుగు మండలాల సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

ఆమదాలవలస: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి తమ్మినేని శారదమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి మండల అధికారులు గైర్హాజరు కావడంపై పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి వైసిపి, టిడిపికి చెందిన పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు హాజరైనప్పటికీ కొన్ని శాఖల మండల అధికారులు హాజరు కాకపోవడం పట్ల పలువురు సభ్యులు మండిపడ్డారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామమూర్తి మాట్లాడుతూ రైతులు పంటలను నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న పరిస్థితుల్లో పౌరసరఫరాల శాఖ డిటి సమావేశానికి హాజరు కాకుండా రెవెన్యూ ఇన్స్పెక్టర్‌ను పంపించడం ఏమిటని ఆర్ఐ శిరీషను ప్రశ్నించారు. నాగవలి ఇరిగేషన్ అధికారులు ప్రతి సమావేశానికి హాజరు కావడం లేదని వారిపై చర్యల నిమిత్తం తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపించాలని ఎంపిడిఒ వాసుదేవరావును కోరారు. కొర్లకోట ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు మాట్లాడుతూ రైతు దగ్గర కొన్న ధాన్యాన్ని నియోజకవర్గ పరిధిలోని మిల్లులకు తరలిస్తారా లేక ఇతర నియోజకవర్గాల మిల్లులకు తరలిస్తారా అంటూ ఎఒను ప్రశ్నించారు. కనుగులవలస సర్పంచ్ నూకరాజు మాట్లాడుతూ మండలాన్ని కరువు మండలంగా ప్రకటిస్తే పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి నష్టపరిహారం రైతులకు అందేవన్నారు. జెడ్‌పిటిసి బెండి గోవిందరావు మాట్లాడుతూ బిఆర్ఆర్ ప్రాజెక్టు వచ్చిన తర్వాత సాగునీటికి ఇబ్బంది లేదని పంటలు కూడా పెద్దగా నష్టం పోవడం లేదని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించలేదని అన్నారు. రైతులకు ప్రభుత్వం నాసిరకం విత్తనాలు సరఫరా చేస్తుందని టిడిపి ఎంపిటిసి బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ అన్నారు. సమావేశంలో వైద్యులు స్రవంతి, మీనా కుమారి, వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, విద్యుత్‌శాఖ ఎఇ రవికుమార్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆర్ఐ శిరీషను ప్రశ్నిస్తున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలం బొరివంక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 33కెవి లైన్ మెంటినెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో మాణిక్యపురం, బల్లిపుట్టుగ, కుసుంపురం, బొరివంక, బిజి పుట్టుగ, ఇద్దివానిపాలెం, బెజ్జిపుట్టుగ పంచాయతీల పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

ఆమదాలవలస : పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మత్తులు, చెట్ల కొమ్మలు తొలగించడంలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. పట్టణంలోని మేదరవీధి, వన్వే జంక్షన్, కంద్రపేట, రైల్వేస్టేషన్ రోడ్డు, వరదా వారి క్వార్టర్స్, రైతుబజార్, లక్ష్మీనగర్ వీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని పేర్కొన్నారు. వినియోగదారులు విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

చేనేత కార్మికులకు అండ

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట మేజర్ పంచాయతీలో శ్రీ చౌడేశ్వరి చేనేత సహకార కేంద్రాన్ని వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శనివారం పరిశీలించారు. అక్కడ దుప్పట్లను నేస్తున్న చేనేత కార్మికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నరసన్నపేట జెడ్‌పిటిసి చింతు రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు పోన్నాన దాలినాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు పొట్నూరు సాయిప్రసాద్, వైస్ ఎంపిపి, వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాగోటి రాజారావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ బురెల్ల శంకర్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు సురంగి నర్సింగరావు, పొందర కార్పొరేషన్ చైర్మన్ రాజాపు అప్పన్న, మండల విప్ వైశ్యరాజు కేశవరాజు, బోరిగివలస సర్పంచ్ బగ్గు రమణయ్య, పొన్నాల ప్రసాద్, వార్డు సభ్యులు ముద్దాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

యోగా భవనం ప్రారంభం.

నరసన్నపేట మేజర్ పంచాయతీ పెద్దపేటవీధి సమీపంలో నూతనంగా నిర్మించిన యోగా భవనాన్ని వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా గురువును సత్కరించారు. కార్యక్రమంలో నరసన్నపేట జెడ్‌పిటిసి చింతు రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు పోన్నాన దాలినాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు పొట్నూరు సాయిప్రసాద్, వైస్ ఎంపిపి, వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాగోటి రాజారావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ బురల్లి శంకర్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు సురంగి నర్సింగరావు, పొందర కార్పొరేషన్ చైర్మన్ రాజాపు అప్పన్న, మండల విప్ వైశ్యరాజు కేశవరాజు, బోరిగివలస సర్పంచ్ బగ్గు రమణయ్య, పొన్నాల ప్రసాద్ పాల్గొన్నారు.

చేనేత సహకార కేంద్రాన్ని పరిశీలిస్తున్న కృష్ణదాస్

విద్యార్థులకు గణిత క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఫోరం ఆధ్వర్యంలో శనివారం మండలస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో తాడివలస జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ద్వితీయ స్థానంలో కింతలి జెడ్‌పిహెచ్‌ఎస్, తృతీయ స్థానంలో పిల్లలవలస జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు నిలిచినట్లు నిర్వాహకులు తేజేశ్వరరావు, దివ్య, హరిప్రసన్నలు తెలిపారు. జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో ఎపి మోడల్ స్కూల్, ద్వితీయ స్థానం తాడివలస, తృతీయ స్థానం పొందూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. అలాగే ఈనెల 14 నుంచి జిల్లాస్థాయిలో జరిగే క్విజ్ పోటీలకు వీరి నుంచి పలువురిని ఎంపిక చేశారు. వీరికి ప్రధానోపాధ్యాయులు వెంకటరావు మెమోంటోలను అందజేశారు. క్విజ్‌పోటీల్లో ప్రతిభను కనపర్చిన విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బూర్జ: పాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక కార్యక్రమం జరిగింది. మండల ఎంఇఒ ధనుంజయరావు ఆధ్వర్యంలో శనివారం జూనియర్, సీనియర్ విద్యార్థులకు మండలస్థాయి గణిత క్విజ్ పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో బూర్జ, పాలవలస, తోటవాడ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. సీనియర్స్ విభాగంలో పాలవలస, తోటవాడ ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఓవి పేట మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు బూర్జ మండల ప్రతినిధులుగా వారణాసి కామేశ్వరరావు, పాలవలస కొమ్ము వర్ధన్, తోటవాడ పాసినిబిల్లి మౌనిక, పాలవలస విద్యార్థులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాపరుద్రరావు, గ్రామ డిసిఎంఎస్ మెంబర్ బలరాం నాయుడు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు ఎస్. శ్రీనివాస్ పట్నాయక్, కె.కాంతారావు, టి.వెంకటరమణ, ఎస్.మోహనరావు, భాస్కరరావు, పిఎన్‌వి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని ఎపి హైకోర్టు న్యాయమూర్తి బి.శ్యామ్ సుందర్ కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన స్వామి సేవల్లో పాల్గొన్నారు. అనివేటి మండపంలో ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, వన్ టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

13న ఉచిత నేత్ర వైద్య శిబిరం

శ్రీకాకుళం అర్బన్: రోటరీ క్లబ్ శ్రీకాకుళం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13న ఉదయం 9 గంటల నుంచి స్థానిక పాత బస్టాండ్ పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద ఎన్‌జిఒ హోం ఆవరణలో ఉచిత మెగా నేత్రవైద్య శిబిరం' నిర్వహించబడునని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డా.వై.గీతాశ్రీకాంత్, అన్నెపు అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన నేత్ర వైద్య నిపుణులతో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అధునాతన ఐఒఎల్ శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహించబడునని, మందులు ఉచితంగా పంపిణీ చేస్తారని తెలియజేశారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సమగ్ర భూ సర్వేతో మేలు

బూర్జ: సమగ్ర భూసర్వేతో అన్ని వర్గాల రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా మేలు చేసే విధంగా అధికారులు సర్వేలు నిర్వహించాలని ఎపిపేట సర్పంచ్ కొరికాన వెంకట శివ సాయి సీతారామరాజు అన్నారు. శనివారం మండలంలో ఎపి పేట పంచాయతీ పరిధిలో ఉన్న కెకె.రాజపురం, ఎపి పేట, గోపిదేవిపేట, అనంతగిరిపేట గ్రామాల్లో డ్రోన్ ఎగరవేసి సమగ్ర భూసర్వేను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర భూసర్వే రాజకీయాలకు అతీతంగా, రైతులకు ఉపయోగపడే విధంగా నిర్వహించి ప్రజా మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ అచ్యుతరావు, సర్వేయర్ సంతోష్, నాయకులు దేవాడ శ్రీనివాసరావు, గిరాడ కేశవ, శంభాన అసిరినాయుడు, రెవిన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కుల గణనపై రౌండ్‌టేబుల్ సమావేశం

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

బాధ్యతాయుతంగా కుల గణన చేపట్టాలని ఎంపిపి ప్రతినిది బి.ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి.సరోజినీ అధ్యక్షతన కుల గణనపై మండల స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని విభాగాల్లో జవాబుదారీతనం ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపిడిఒ పి.చంద్రకుమారి మాట్లాడుతూ అధికారులు, నాయకులు సమన్వయం చేసుకొని కులగణన చేయాలన్నారు. దానికోసం అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి ఎస్.ఆదినారాయుడు, ఇఒపిఆర్‌డి టి.తారకేశ్వరి, ఎపిఒ రవి, ప్రసాదరావు, శ్రీనివాసరావు, ఎస్.గౌరీష్, అప్పారావు, పాపారావు, వెంకటేష్, భాస్కరరావు పాల్గొన్నారు.

బెజ్జిపురంలో అన్నదానం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బెజ్జిపురంలో శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కార్తీక కోటి దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పలు గ్రామలకు చెందిన 5 వేల మందికిపైగా ప్రజలు పాల్గొన్నారు. అలాగే మాజీమంత్రి, పొలిట్ బ్యూరోసభ్యులు కిమిడి కళావెంకటరావు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కళా వెంకటరావు వెంట టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, పిన్నింటి మధుబాబు, ఎం.ప్రసాదరావు, గంట్యాడ అప్పలనాయుడు, దన్నాన అజర్, వడ్డిపల్లి శ్రీను, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనివాసరావు ఉన్నారు.

భోజనాన్ని వడ్డిస్తున్న కళావెంకటరావు

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి- రణస్థలం

ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ మండల కేంద్రంలోని ఇడదాసుల విద్య, ఆరోగ్య సేవా ఫౌండేషన్ గ్రంథాలయానికి రూ.15 వేలు విలువైన పుస్తకాలను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు ఇడదాసుల వెంకట సత్యనారాయణ, అధ్యక్షులు ఇడదాసుల తిరుపతిరాజు మాట్లాడుతూ పిన్నింటి సాయి సేవా ఫౌండేషన్ గ్రంథాలయాన్ని ఇటీవల సందర్శించిన సందర్భంలో నిరుద్యోగులతో మాట్లాడారని అన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందచేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీ మేరకు రూ.15 వేలు విలువైన పుస్తకాలు అందించి ఆయన సేవా దక్పథానికి ధన్యవాదాలు తెలిపారు. గ్రంథాలయంలో విద్యార్థులకు అందుబాటులో పుస్తకాలు ఉంచామన్నారు. ఈ పుస్తకాలను ఉపయోగించుకుని ఉద్యోగార్థులు పోటీ పరీక్షల్లో మరింత మంది ఉద్యోగాలను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు తిరుపతిరాజు, గ్రంథాలయ సభ్యులు పాల్గొన్నారు.

మహిళపై కేసు నమోదు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

నందిగాం మండలం ఆర్‌జె బొడ్డపాడు గ్రామానికి చెందిన మురపాల చిరంజీవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ షేక్‌మహమ్మద్ అలీ తెలిపారు. చిరంజీవులు శుక్రవారం ఉదయం తన గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై తన మేనకోడలు స్వగ్రామమైన కోటబొమ్మాళి మండలం దుప్పిలపాడుకు వస్తుండగా జాతీయ రహదారి గుంజలోవ జంక్షన్ వద్ద గుర్తుతెలియని మహిళ తనను లిఫ్ట్ అడుగ్గా అమెను వాహనంపై ఎక్కించుకొని కస్తూరిపాడు జంక్షన్ వద్దకు చేరేసరికి ఆ మహిళ బండి ఆపమని బండిదిగుతూ తన మెడలో ఉన్న తులమున్నర బంగారు చైన్‌ను (సుమారు రూ. 2.50లక్షలు విలువ కలిగిన) తెంపుకొని రోడ్డు పక్కన ఉన్న తుప్పల్లోకి పారిపోయిందని, తాను బండి ఆపి తుప్పల్లో వెతికినా కనిపించలేదని, అక్కడ నుంచి దుప్పిలపాడు గ్రామానికి వెళ్ళి బంధువులకు, పెద్దలకు విషయం తెలియజేశామని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇసుక లారీ సీజ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో వంశధార నది పరివాహక ప్రాంతం చెవ్వాకులపేట నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకలారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ వై.కృష్ణ తెలిపారు. చెవ్వాకులపేట ఇసుక స్టాక్ పాయింట్ నుంచి శ్రీకాకుళం రూరల్ మండలం పొన్నాం గ్రామానికి చెందిన లారీడ్రైవర్ పోలాకి నాగేశ్వరరావు అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా 30 టన్నుల ఇసుకను లోడ్ చేసుకొని వెళ్తుండగా రామచంద్రాపురం గ్రామం వద్ద రహదారి గోతుల్లో లారీ దిగబడి పోయి రహదారిపైనే లారీ నిలిచిపోయింది. పోలీసులకు అందిన సమాచారంతో అక్కడకు వెళ్లి లారీని తనిఖీ చేయగా ఎటువంటి అనుమతులు లేకపోవడంతో లారీలోని ఇసుకను అక్కడ అన్‌లోడ్ చేసి లారీని స్టేషన్‌కు తరలించామని, లారీడ్రైవర్ నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంపీ దృష్టికి సమస్యలు

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలోని గార మండలం కొమరవానిపేటలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరారు. నగరంలోని ప్రజాసదన్‌లో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో పాటు గ్రామస్తులు కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సిమ్మెంట్ రోడ్లు, కాలువల నిర్మాణ, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

కిషోర్ బిసాయి

కవిటి: నంద్యాల వేదికగా ఈ నెల 10 నుంచి 12 వరకు జరగనున్న అండర్-14 త్రోబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కిషోర్ బిసాయి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.సుమలత తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు ఎంపికైన విద్యార్థి కిషోర్‌ను, అందుకు సహరించిన వ్యాయామ ఉపాధ్యాయులు రవి మహంతి, ఎం.తోటారావులను సర్పంచ్ లలితా దేవరాజ్ సాహు, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పూర్తయిన ప్రహరీ గోడ

పాఠశాల ప్రహరీ నిర్మాణం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

కవిటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో తాండవిస్తున్న అపరిశుభ్రత, పాఠశాలకు, చేపల మార్కెట్‌కు మధ్య ప్రహరీ లేకపోవడంపై ప్రజాశక్తి 'చదువు సాగేదెలా' అంటూ కథనం ప్రచురించింది. ముఖ్యంగా చేపల మార్కెట్‌కు, పాఠశాలకు మధ్య ప్రహరీగోడ లేకపోవడంపై మార్కెట్ వ్యర్థాలు పాఠశాల వైపు పడివేయడంతో వచ్చే దుర్వాసనతో అప్పట్లో చాలామంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. దీనిపై ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన ఎంపిటిసి పూడి నీలాచలం, సర్పంచ్ పూడి లక్ష్మణరావు సహకారంతో మండల పరిషత్ నిధులు రూ.90వేలుతో పాఠశాలకు, మార్కెట్‌కు మధ్య ప్రహరీగోడ నిర్మాణం పూర్తి చేశారు. ఎంతో కాలంగా వేధిస్తున్న సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న సిఇఒ వెంకటరామన్

ప్రజలకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రజలకు మరింత సేవలు అందించాలని జిల్లా పరిషత్ సిఇఒ ఆర్.వెంకటరామన్ అన్నారు. శనివారం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ముగింపు శిక్షణ సమావేశంలో పాల్గొన్నారు. ఈనెల 4 నుంచి 9వరకు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లుకు ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది వాలంటీర్ల సమన్వయంతో ముందుకు వెళ్లి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంపిడిఒ ఎం.పావని, ఇఒ బి.రాంబాబు, ఇఒపిఆర్‌డి కృష్ణారావు పాల్గొన్నారు.

13న బస్సు యాత్ర

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, మండల వైసిపి కన్వీనర్ పల్లి యోగి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. ఈనెల 13న నియోజకవర్గంలో జరగనున్న బస్సు యాత్రను సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాలరాజు, ఎస్.ఆదినాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు

మాట్లాడుతున్న వైద్యాధికారి జష్మిత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఏభై ఏళ్లు పైబడిన నాటి నుంచి ఆరోగ్య సంరక్షణపై మరింత శ్రద్ధ చూపుతూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసుకోవాలని జెమ్స్ వైద్య నిపుణులు డాక్టర్లు జష్మిత, సాయివివేక్‌లు సూచించారు. నగరంలోని జెమ్స్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రభుత్వ విశ్రాంత ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన హెల్త్ అవేర్‌నెస్ క్యాంపును శనివారం నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ పాటించాల్సిన ఆహార నియమాలు, పాటించాల్సిన వ్యాయామం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తరచూ సుగర్, బిపిలు తనిఖీ చేయించుకోవాలన్నారు. గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ముందస్తుగా ఇసిజి, ఇతర పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రణాళికతో మితంగా ఆహారపు అలవాట్లను, కనీసం దినానికి అర గంటపైగా నడక తప్పనిసరన్నారు. స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ ఐశ్వర్య స్త్రీలకు సంబంధించిన వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ రాందాస్ నాయక్ కీళ్ల సంబంధిత వ్యాధులపై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎస్.ఆర్.ఎస్. ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి పి.నరసింహమూర్తి, నగర అధ్యక్షులు కె.సోమ సుందరరావు, కార్యదర్శి పి.ఎస్ .ప్రసాదరావు, జానకిరామ్, కోటేశ్వరరావు, గణపతి ఆచారి, సవరయ్య, పోలయ్య పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదినం

పలాస : కాంగ్రెస్ పార్టీలో పని చేయడం దేశసేవగా తాను భావిస్తానని కాశీబుగ్గకు చెందిన ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు దువ్వాడ జీవితేశ్వరరావు అన్నారు. శనివారం సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా రాష్ట్ర రాజధాని అమరావతి ఆంధ్రరత్న భవనంలో జరిగిన సోనియా జన్మదిన వేడుకల్లో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జీవితేశ్వరరావు మాట్లాడుతూ పరోక్ష రాజకీయాల్లో పార్టీ విధేయుడుగా అనేక సందర్భాల్లో సహాయ, సహకారాలు అందించేవాడనని, ఇప్పుడు అధికారికంగా పార్టీలో చేరుతున్నానని స్పష్టం చేశారు. ఆయనతో పాటు పలాసకు చెందిన విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు బమ్మిడి రాజారావు, బమ్మిడి నాగేశ్వరరావు, కొప్పురోతు వెంకటరావు, జిల్లా డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు నాయకత్వంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, పిసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీరామ్మూర్తిలు పాల్గొన్నట్లు తెలిపారు.

ఇచ్ఛాపురం : కాంగ్రెస్ పార్టీ ఎఐసిసి నాయకులు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత స్వేచ్ఛా వతి ఆలయాన్ని సందర్శించి అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ ఎం.చక్రవర్తిరెడ్డి, కో-ఆర్డినేషన్ సభ్యులు అలీమ్ ఖాన్, ఈరోతు యుగంధర్, వైద్యులు దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పలాస: జీవితేశ్వరరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

అవగాహన కల్పిస్తున్న కృష్ణమూర్తిరెడ్డి

మానవ హక్కుల రక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని, తోటి వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని లయన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు పి.రవికుమార్ అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యాన కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, నేషనల్ చీఫ్ సెక్రెటరీ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డాక్టర్ బాడాన దేవభూషణరావు, సెక్రెటరీ రాంగోపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి, లయన్స్ క్లబ్ సభ్యులు కామేష్, లెక్చరర్లు కిల్లి అప్పారావు, హేమసుందరరావు, సీపాన రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యాన శనివారం 'ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు మానవ హక్కుల ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. కళాశాల రాజనీతి శాస్త్ర విభాగాధిపతి పి.శంకర నారాయణ మాట్లాడుతూ మానవ హక్కులు అన్ని దేశాల్లో అమలు పరచాలనే ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని అందరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ ఎన్.చిన్నారావు అర్థశాస్త్ర విభాగాధిపతి టి.ఆదిలక్ష్మి, తెలుగుశాఖ విభాగాధిపతి డాక్టర్ కె.జ్యోతిలక్ష్మి, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, ఆంగ్ల విభాగాధిపతి పి.సాయికనకదుర్గ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు.

ఇచ్ఛాపురం: డిసెంబర్ 10 ప్రపంచ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక కళాశాల విద్యార్థులకు పలు అంశాలపై వ్యాసరచన పోటీలు, హ్యూమన్ రైట్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ దక్కత కృష్ణమూర్తి రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ హ్యూమన్ రైట్స్ పట్ల అవగాహన అవసరమన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, కుల, మత, ప్రాంతీయ, లింగ వివక్ష లేకుండా ఉండాలని, సామాన్యులకు అన్యాయం జరిగితే హ్యూమన్ రైట్స్‌ను సంప్రదించాలని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శాంతినికేతన్ స్కూల్‌లో జరగనున్న ప్రపంచ హ్యూమన్ రైట్స్ దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రోబినాథ పాడి, ఉమెన్ కళాశాల ప్రిన్సిపాల్ నవ్య, ఆర్గనైజ్డ్ సెక్రెటరీ కోట రామారావు, సభ్యులు కె.సి పూరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవికుమార్

అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని డే నైట్ కూడలి వద్ద ఉన్న డాక్టర్ లక్ష్మీనారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మెదడు, వెన్నుపాము నరాల వ్యాధుల నిపుణులు డాక్టర్ లక్ష్మీనారాయణ అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఎచ్చెర్ల మండలం కేశవరాయునిపేటకు చెందిన 50 ఏళ్ల వయసు గల లక్ష్మి మెదడులో రక్తనాళాల డెవలప్‌మెంట్‌లో లోపం ఉంది. దీంతో రక్తనాళాలు పెద్ద పెద్ద ముద్దలుగా తయారయ్యాయి. దీనివల్ల మెదడులో అన్ని వైపుల వ్యాప్తి చెందింది. పర్యవసానంగా రక్తం గడ్డకట్టడం జరుగుతుంది. రక్తం గడ్డకట్టడం వల్ల విపరీతమైన తలనొప్పి, వాంతులు, ఫిట్స్ వచ్చేదని, కాళ్ల చేతులకు కూడా ప్రాకేదని, వైద్యులను సంప్రదించినా నయం కాలేదు. దీంతో డాక్టర్ లక్ష్మీనారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సంప్రదించారు. డాక్టర్ పైల లక్ష్మీనారాయణ రోగి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి అరుదైన శస్త్ర చికిత్సను శనివారం విజయవంతంగా నిర్వహించారు. సుమారు ఎనిమిది గంటలు శ్రమపడి ఆపరేషన్ విజయవంతంగా పూర్తిచేశారు. ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో కోలు కున్నట్టు వైద్యులు లక్ష్మీనారాయణ తెలిపారు.

శస్త్ర చికిత్స ద్వారా తొలగించిన వ్యర్థాలు

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

పలాస: చిన్నతనం నుంచే చదువుపై దృష్టి సారించాలని ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ వైశ్య సంఘం అధ్యక్షుడు మల్లా భాస్కరరావు విద్యార్థులకు సూచించారు. పలాస ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఆయన 50 మంది విద్యార్థులకు అన్నం ప్లేట్లు, గ్లాసులు, 100 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సనపల జనార్ధనరావు, కృష్ణచంద్ర పాత్రో, సిఆర్‌ఎంటి అప్పలరాజు పాల్గొన్నారు.

పుస్తకాలను పంపిణీ చేస్తున్న భాస్కరరావు

పోలింగ్ కేంద్రం పరిశీలన

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలోని అంపోలు పోలింగ్‌లో ఓటర్ల నమోదు, తొలగింపులు, చేర్పుల ప్రత్యేక కార్యమాన్ని నిర్వహించారు. దీనిని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి శనివారం పరిశీలించి బిఎల్‌ఒలతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి జిల్లా యంత్రాంగం నియమించిన బిఎల్‌ఒ రాగ ద్వేషాలకు తావులేకుండా ఈ ప్రక్రియ కొనసాగించాలని కోరారు. ఎక్కడా లోపాలకు తావివ్వకుండా బాధ్యతా యుతంగా పనిచేయాలన్నారు. టిడిపి తరపున బూత్ లెవెల్ ఏజెంట్లు అందుబాటులో ఉంటారని, ఎక్కడైనా అభ్యంతరాలు వచ్చినా వాటికి క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. అలాగే ఒకే ఓటు రెండు, మూడు పోలింగ్ బూత్‌ల్లో ఉంటే వాటిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ను నాగార్జున ప్రతాప్, టిడిపి మండల ఉపాధ్యక్షులు వెలమల శ్రీనివాస్, బూత్ ఇన్‌ఛార్జి వెలమల దాసు, మన్మథరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీదేవి

టిడిపి విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి- మందస

2014 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పిలుపునిచ్చారు. శనివారం మండలం బహాడపల్లి గ్రామంలో నిర్వహించిన టిడిపి ఆత్మీయ సమావేశంలో పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే పార్టీ అమలు చేసే పథకాలపై ప్రజలకు అవగాహన చేయాలని సూచించారు. ఓటరు జాబితాపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

నేడు లావేరులో వనభోజనం

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరులో ఆదివారం శ్రీ భ్రమరాంబిక మల్లన్న దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బొడ్డపాడు గ్రామ సమీపంలో పౌర సరఫరాల గోదాం సమీపంలో మామిడితోటలో వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చెయ్యాలని ఆ సంఘం అధ్యక్షులు దేశెట్టి వెంకటరావు, సభ్యులు ఉప్పు వీర్రాజు, నల్ల అప్పారావు, వి.సత్యం కోరారు.

సిఎం దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి- కొత్తూరు

వంశధార నిర్వాసితుల పెండింగ్ సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్లాలని వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావుకు తన స్వగృహంలో శనివారం వైసిపి నాయకులు బెహరా, వెంకట సత్యనారాయణ, బురవెల్లి రామణ బెహర, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కె.సంజీవరావు, ప్రశాంత్ వినతిపత్రం అందించారు. ఈ నెల15న పలాస సిఎం జగన్మోహన్ రెడ్డి రానున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

సీడర్ ద్వారా వరి విత్తనాలను వేస్తున్న రైతు

కషాయాల ద్వారా ఆరోగ్యకరమైన పంట

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

కషాయాలను ఉపయోగించి వ్యవసాయం చేయడం వలన ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చని యూనిట్ ఇన్‌ఛార్జి పెద్దింటి రాజేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని బంటుపల్లి గ్రామంలో చాప ఈశ్వరరావు డ్రం సీడర్ ద్వారా వరి విత్తనాలను వేసారు. ఇలా వేయడం వలన రైతుకు ఒక ఎకరానికి సుమారు రూ.5వేలు నుంచి రూ.6వేలు ఖర్చులు తగ్గుతుందన్నారు. అలాగే పురుగులు, తెగుళ్ల నివారించవచ్చన్నారు. అధిక దిగుబడిని సాధించవచ్చుని, ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో జీవామృతాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కంబకు కృష్ణ, ఐసిఆర్‌పి గిడిజాల సూర్యకాంతం, రైతులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న సిఆర్‌ఎంటిలు

వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- పలాస

మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సిఆర్‌ఎంటి (క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్) వేతనాలను తక్షణమే చెల్లించాలని ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పోతనపల్లి బాలరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రం వద్ద మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ శ్రీనివాసరావుకు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి, రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. గత నాలుగు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శేషగిరి, అప్పలరాజు, సునీల్ కుమార్, భాస్కర్, శివ, కేశవ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు, లబ్ధిదారులకు మరింత అవగాహన కల్పించాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు అన్నారు. శనివారం గునుపల్లి సచివాలయంలో మహిళా సంఘాల సభ్యులు, వాలంటీర్లకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి అవాస్ యోజన, జగనన్న కాలనీలతో పేదలందరికీ సొంతింటి కల నెరవేరుతుందన్నారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సుమారు 3,257 జబ్బులకు ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయన్నారు. వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, మహిళ సాధికారిత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. మహిళ సంఘాల సభ్యులు స్థానిక వస్తువుల ఉత్పత్తిదారులుగా మారాలన్నారు. వాలంటీర్లు ప్రభుత్వ విధానాలు, సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తూ అనుసంధాన కర్తలగా వ్యవహరించాలని కోరారు.

మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

ఘనంగా నారాయణస్వామి వర్థంతి

పలాస : కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో మాదాల నారాయణస్వామి 10వ వర్థంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ నారాయణస్వామి బెనారస్ విశ్వవిద్యాలయంలో ఎంఎ ఎకనామిక్స్ విద్యను అభ్యసించి ఆ రోజుల్లోనే జాతీయ ఉద్యమంలో పాల్గొని వామపక్ష భావాలవైపు ఆకర్షితులై తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమానికి మద్దతుగా ఉక్కు పరిశ్రమ సాధించుకోవడం కోసం ఒంగోలు పార్లమెంట్ స్థానానికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మద్దిల వినోద్, నాయకులు వంకల పాపయ్య, ఆరుణోదయ సాంస్కృతి సమైక్య జిల్లా అధ్యక్షులు ఎస్.రామారావు, కార్యదర్శి సోమేశ్వరరావు, బతకల ఈశ్వరమ్మ, నర్తు దానేష్, సరస్వతి, కోదండు ఆదివాసి సంఘం నాయకులు సవర బంగ్లా కుమార్ పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

మహిళలకు రక్తహీనతపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు రక్తహీనతపై శనివారం అవగాహన కల్పించారు. మూడవ వారం మహిళల్లో 'శక్తి హీనత' అంశంపై స్వయం సహాయక సంఘసభ్యులకు అవగాహన, ప్రతిజ్ఞ చేయించారు. రక్తహీనతకు కారణాలు, జాగ్రత్తలు, పిల్లలు, గర్భిణీలు, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార పదార్థాలపై స్వయం సహాయక సంఘ సభ్యులు వివరించారు. కార్యక్రమంలో విఎఒలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామసమాఖ్య మహిళలు పాల్గొన్నారు.

ఎంపికైన నాట్య కళాకారులు

13న షిర్డీలో నాట్య ప్రదర్శన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఈ నెల 13న షిర్డీ క్షేత్రంలో ఇచ్ఛాపురం వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి చిన్నారులు నాట్య కళా ప్రదర్శన ఇవ్వనున్నారని అకాడమీ చైర్మన్ వెంకటేశ్వర పట్నాయక్ శనివారం తెలిపారు. డాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులకు చక్కని అవకాశాన్ని దేవస్థానం అధికారులు కల్పించారని నాట్య గురువు ఏలేశ్వరపు శ్రీనివాసులు పేర్కొన్నారు. నాట్య గురువు శృతి పట్నాయక్, దట్టి కావ్య, సిల్లా పూజ, చాట్ల విజయలక్ష్మి, జోగి అంకిత, కొరివి లక్ష్మి, నీలాపు ప్రీతి, బల్లెడ శ్రీదీక్షిత, ఆర్.మధుశ్రీ, నీలాపు స్రవంతిలు ఎంపికయ్యారన్నారు. చిన్నారులకు ఆర్థికసహాం బల్లెడ కృష్ణారావు, బి.మోతిలాల్ దంపతులు అందించారని తెలిపారు.

మాజీ కౌన్సిలర్ మృతి

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని మంగువారి తోటలో నివాస ఉంటున్న మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రోణంకి మల్లేశ్వరరావు (64) శనివారం మృతి చెందారు. ఆయన భార్య త్రిలోచన కూడా కౌన్సిలర్‌గా టిడిపి తరపున ఎన్నికయ్యారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు చేరుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారితో పాటు నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ను నాగార్జున ప్రతాప్, మాజీ కౌన్సిలర్ కెల్ల కొండబాబు, పార్టీ నాయకులు విభూది సూరిబాబు, బసవ రాజేష్ రెడ్డి, వెంకటరావు ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసికి నిరంతరాయంగా సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు కనీస సమస్యలు పరిష్కంచడం లేదని, దీనివల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.అప్పారావు, ఎస్ఎస్ఆర్ శర్మలు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో కె.శంకరరావు అధ్యక్షతన విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులకు మినిమం పిఎఫ్ పెన్షన్ రూ.7,500, డిఎ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హయ్యర్ పెన్షన్ ఇవ్వాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొర్లాం గణేశ్వరరావు, పెంటయ్య, ప్రతాప్, సంజీవి, రామారావు, చిన్నారావు, జె.ఎస్.రాజు, ప్రసాద్, సత్యం, స్వామి, సుబ్బారావు, రుషి, శాస్త్రి, నాయుడు, మల్లేషు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రాంతంలో ఈ నెల 15న సిఎం జగన్మోహనరెడ్డి పలు ప్రారంభోత్సవాలకు హాజరవుతున్న సందర్భంగా ఆయన పర్యటనను విజయవంతం చేయాలని పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కోరారు. శనివారం తన స్వగహం వద్ద మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధి పద్మనాభపురం వద్ద 2019 ఏప్రిల్‌లో రూ.50 కోట్లతో 200 పడకల ఆస్పత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రం నిర్మించేందుకు భూమిపూజ చేశారని, తిరిగి ఆయన చేతుల మీదుగానే ప్రారంభోత్సవం జరుపుకోవడం మున్సిపాలిటీకి ఒక వరమన్నారు. కార్యక్రమంలో జీడి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు మల్లా సురేష్, పారిశ్రామికవాడ సంఘం అధ్యక్షులు మల్లా రామేశ్వరం, యాళ్ల సంతోష్ పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- పొందూరు

18 ఏళ్లు నిండి అర్హత కలిగిన ప్రతిఒక్కరు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని నియోజకవర్గం ఎన్నికల నోడల్ అధికారి ప్రగాడ దుర్గారావు పేర్కొన్నారు. శనివారం పొందూరు సిస్టమ్ కళాశాలలో యువతకు ఓటుహక్కు నమోదుపై అవగాహనను కల్పించారు. అనంతరం ఓటుహక్కు నమోదు చేసుకోవాలంటూ నినాదాలు చేస్తూ అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విఆర్‌ఒ మొగదాల శంకరరావు, కళాశాల కరస్పాండెంట్ మొదలవలస మోహనరావు, ఛైర్మెన్ మొదలవలస సాయికృష్ణ, ప్రిన్సిపాల్ బోర రమణ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన

శ్రీకాకుళం అర్బన్ : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశ్రా ఆధ్వర్యాన నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ సీనియర్ న్యాయవాది కె.ఇందిరాప్రసాద్ పాల్గొని మాట్లాడారు. వినియోగదారులకు వారెంటీ సేవలు, ప్రమాదకరమైన ఉత్పత్తులు, కల్తీ వస్తువులు, నకిలీ వస్తువుల విక్రయం, తప్పుతోవ పట్టించే ప్రకటనలు, నిర్దేశిత ప్రమాణం పాటించకపోవడం, నిర్దిష్ట ధర కంటే ఎక్కువ వసూలు, కృత్రిమ డిమాండ్, కొరత సృష్టించడం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆశ్రా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఏజ్రా వినియోగదారులు హక్కులు భాద్యతలు, వివాదాల పరిష్కార విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, మాజీ గవర్నర్ కూన వెంకట రమణమూర్తి సంతు, ప్రసాద్, లఖినాన రవికుమార్, కట్టా పార్థసారథి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఆశ్రా ప్రతినిధులు

పలువురికి పరామర్శ

లావేరు : పరామర్శిస్తున్న కళా వెంకటరావు

ప్రజాశక్తి- లావేరు

మండలం కొత్తకుంకం పంచాయతీ మాజీ సర్పంచ్ పనస జగ్గయ్య కుటుంబాన్ని మాజీమంత్రి, ఎచ్చెర్ల టిడిపి ఇన్‌ఛార్జి కిమిడి కళావెంకటరావు శనివారం పరామర్శించారు. ఇటీవల జగ్గయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన పరామర్శించి జగ్గయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే అదే గ్రామానికి చెందిన మాజీ వైస్ సర్పంచ్ దొండపాటి తవిటయ్య మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈయనతో పాటు టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ సర్పంచ్ కునబిల్లు దామోదరరావు, దారపురెడ్డి కూర్మారావు, పెద్దకొత్తపల్లి సర్పంచ్ ఆరేళ్ళ కృష్ణ, రమేష్, సోంబాబు ఉన్నారు.

పలాస: మందస మండలం లింబుగాం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి మండల మోహనరావు, బుడార్శింగి పంచాయతీ సాబకోట గ్రామానికి చెందిన డోలాయి శశి ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మృతుల కుటుంబాలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు దాసరి తాతారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సంత బొమ్మాళి: నరసాపురంకు చెందిన బిఎస్‌ఎఫ్ జవాన్ మోడీ మధురెడ్డి ఇటీవల మరణించారు. శనివారం మృతుని తండ్రి మోడీ ఈశ్వరరావు కుటుంబాన్ని మాజీ మంత్రి కిల్లి కృపారాణి పరామర్శ చేసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దుక్క భూషణ్ రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ మోడీ భాస్కర రెడ్డి, సూరాడ జోగారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మండలంలోని చిన్నహరిశ్చపురంలో ఇటీవల పాముకాటుకు గురై జి.గోవిందరావు మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మృతుని కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు.

మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి తగు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.కేశవరావు, ఎంపిటిసిలు బగాది మాధవీదివాకర్, పూజారి సత్యం పాల్గొన్నారు.

పలాస : పరామర్శిస్తున్న శిరీష

సంతబొమ్మాళి : పరామర్శిస్తున్న కృపారాణి


కోటబొమ్మాళి : కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కృపారాణి